RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ || సంచిక 306 || సంపుటి 4 || బుధవారం || 12-08-2026 || పేజీలు 4 || వెల 3/-

## ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'

న్యూఢిల్లీ ఆగస్టు 11(ప్రభాత గమనం):

స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా ఆగస్టు 15న తొలిసారిగా ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ గీతానికి ముందు 'వందేమాతరం' గేయాన్ని ఆలపించనున్నారు. వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పీఎం మోదీ ఎర్రకోట వద్దకు రాగానే వందేమాతరం ఆలపిస్తారని, అనంతరం జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత 'జనగణమన' గీతాన్ని ఆలపిస్తారని వెల్లడించారు.



# డిఫాల్టర్ మిల్లర్లపై చర్యలేవి?

- కోట్ల రూపాయల ధాన్యం 'మింగినా' అధికార యంత్రాంగం 'మౌనం'!
- ఆర్ఆర్ యాక్ట్‌కు పాతర.. గడువు దాటినా లొసుగులతో కాలయాపన
- ఉన్నతాధికారుల మౌనం వెనుక 'రహస్య ఒప్పందాలు'న్నాయా..?

మహబూబాబాద్ ఆగస్టు 11 (ప్రభాత గమనం ):

ప్రభుత్వ ధాన్యాన్ని సేకరించి, సమయానికి బియ్యం (సిఎమ్ఆర్ - కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించాల్సిన రైస్ మిల్లర్లు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నా సంబంధిత అధికారులు 'కళ్లప్పగించి' చూడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. గడువులు ముగుస్తున్నా, ప్రభుత్వ హెచ్చరికలు పక్కనబెట్టి ధాన్యాన్ని బొక్కేసిన డిఫాల్టర్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడంలో పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగం చూపుతున్న 'ఔదార్యం' వెనుక ఉన్న మతలబు ఏంటనే ప్రశ్నలు గుప్పుమంటున్నాయి.రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వేల టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం పంపగా, ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సిఎమ్ ఆర్ కింద ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అయితే, కొందరు కేటగిరీ 'డిఫాల్టర్' మిల్లర్లు ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించుకొని, కోట్ల రూపాయల అక్రమ ఆర్జనకు తెరలేపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నిర్వహించిన తనిఖీలు, భౌతిక ప్రామాణికత ఆడిట్లలో మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం నిల్వలు మాయమైనట్లు స్పష్టంగా తేలినప్పటికీ, వారిపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయడం కానీ, మిల్లులను సీజ్ చేయడం కానీ జరగకపోవడం గమనార్హం.ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయడానికి అత్యంత శక్తివంతమైన 'రావెన్యూ రికవరీ చట్టం' నిబంధనలు ఇక్కడ మట్టికొట్టుకుపోతున్నాయి. గడువులోగా ధాన్యం ఇయ్యని మిల్లర్ల ఆస్తులను జప్తు చేసి, ఆర్ఆర్ యాక్ట్ కింద వేలం వేసి ప్రభుత్వ సొమ్మును జమ చేసుకోవాలి. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల తీరు చూస్తుంటే మిల్లర్లకు నోటీసుల పేరుత. కాలయాపన డ్రామా" నడుపుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కాగితాలకే పరిమితమైన నోటీసులతో కాలం గడుపుతూ, వేల కోట్ల రూపాయల బకాయిలను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని సమాచారం. ఉన్నతాధికారుల మౌనం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల మర్మం' దాగి ఉందనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి.

- **గడువు ముగిసి నెలలు గడుస్తున్నా సస్పెన్షన్లు లేవు.**

రికవరీ చర్యల వేగంలో తీవ్ర నెమ్మది. పొలిటికల్ ప్రెజర్ల సాకుతో బాధ్యతల నుంచి తప్పకునే యత్నం. మిల్లర్లు, అధికారుల మధ్య కుదిరిన 'రహస్య ఒప్పందాల' వల్లే ఆర్ఆర్ చట్టం అమలు కాకుండా ఫైళ్లు బుట్టదాఖలవుతున్నాయని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. డిఫాల్టర్ల జాబితాను బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా బుక్కేసిన ఘనులపై ప్రభుత్వం వెంటనే కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. డిఫాల్ట్ అయిన ప్రతీ రైస్ మిల్లుపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆర్ఆర్ యాక్ట్ ద్వారా వారి ఆస్తులను జప్తు చేయకపోతే ప్రభుత్వ ఖజానాకు మరింత గండిపడక తప్పదు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి చర్యలకు పూనుకుంటారో.. లేక డిఫాల్టర్ల ప్రేమలో మునిగితేలుతారో వేచి చూడాల్సిందే!




## తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి నిరసన

- **పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం...**

కేసముద్రం ఆగస్టు 11(ప్రభాత గమనం):



కేసముద్రం తాసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నాడు ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక తాసిల్దార్ బాధితుని తల్లి దండ్రుల వద్ద నుండి భూమిని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో లక్ష బయానాగా తీసుకున్నారని చెప్పారు. 25 లక్షల విలువ గల భూమికి కేవలం లక్ష రూపాయలు మాత్రమే కట్టి రిజిస్ట్రేషన్ కొరకు తాసిల్దార్ స్లాట్ బుక్ చేసుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు తమ తల్లిదండ్రులను కేసముద్రం తాసిల్దార్ కార్యాలయానికి రాత్రివేళ పిలిపించి భయబ్రాంతులకు గురి చేశారని చెప్పారు.తహశీల్దారు కేవలం లక్ష మాత్రమే కట్టారని, మిగతా డబ్బులు అడిగేసరికి లక్షకు లక్ష బదులుగా ఇవ్వాలని తాసిల్దారు హుకూం జారీ చేశాడని తెలిపారు. వాస్తవానికి తాసిల్దార్ పూర్తి డబ్బులు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి కానీ,తమ వద్దనే అదనంగా లక్ష రూపాయలు వసూలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బాధితుడు తమ తల్లిదండ్రుల వద్ద నుండి విషయం తెలుసుకుని నేరుగా తాసిల్దార్ కార్యాలయంకు వచ్చి తాసిల్దారును నిలదీసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## రాజేంద్రనగర్ బాధితులకు న్యాయం చేయండి

- **కోర్టు పరిధిలో ఉన్న సివిల్ వివాదాల్లో స్థానిక పోలీసులు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి**
- **పేద కాలనీ నివాసితులకు పూర్తి రక్షణ కల్పించాలి**
- **పేదల ఇళ్లను లాక్కుంటే ఊరుకునేది లేదు హైదరాబాద్ సీపీకి టీఆర్పీ నేతల ఫిర్యాదు**

హైదరాబాద్ ఆగస్టు 11(ప్రభాత గమనం):

రాజేంద్రనగర్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీ నివాసితుల సమస్యలపై టీఆర్పీ చీఫ్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలసి సీపీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రామం సర్వే నంబర్ 312 లోని హనుమాన్ నగర్ కాలనీలో నివసిస్తున్న పేద రోజువారీ కూలీలను ప్రైవేట్ బిల్డర్లు, డెవలపర్లు బెదిరింపులకు గురిచేస్తూ, ఇళ్ల నుంచి బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన మల్లన్న.. పేదలకు అండగా నిలబడాలని, ఉన్నతాధికారులను కలిసి న్యాయం జరిగేలా చూడాలని పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ వివాదానికి సంబంధించిన సివిల్ కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, హైకోర్టు ఆదేశాల ప్రకారం పోలీసులు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోకూడదని నాయకులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ స్థానిక పోలీసులు బిల్డర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై శాఖాపరమైన విచారణ జరిపి, అనధికారిక పోలీసు రక్షణను నిలిపివేయాలని కోరారు. హనుమాన్ నగర్ కాలనీ నివాసితులకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్, వెంకటేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడి

- **9 మంది నిందితులు అరెస్ట్**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై సిసిఎస్ బృందం దాడి నిర్వహించరు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 09 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,990 నగదు, 02 ద్విచక్ర వాహనాలు, 09 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపూర్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు కొనసాగుతోంది.

## తన సొంత ఆస్తిని కూతురికి ఇవ్వొద్దన్న తండ్రి వీలునామా చెల్లుతుంది

న్యూఢిల్లీ ఆగస్టు 11(ప్రభాత గమనం):



ఇతర మతస్థుడిని పెళ్లి చేసుకున్న కూతురికి తాను సొంతంగా కష్టపడి సంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వనని తండ్రి రాసిన వీలునామా చెల్లుతుందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కేరళ కేసు విచారణలో, తన కష్టార్జితాన్ని ఎవరికివ్వాలనేది తండ్రి ఇష్టమని, కోర్టులు జోక్యం చేసుకోలేవని తెలిపింది. అయితే, తాతల కాలం నుంచి వచ్చే ఆస్తి విషయంలో మాత్రం కుమార్తెకు పుట్టుకతోనే హక్కు ఉంటుందని, దాన్ని తండ్రి నిరాకరించలేదని పేర్కొంది..

# కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని మృతి

- బాధ్యత ఎవరిది...?
- ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాద ఘటన



ఖమ్మం జిల్లా ఆగస్టు 11(ప్రభాత గమనం):

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనారోగ్యానికి గురై మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. విద్యార్థినికి జలుబు, జ్వరం, అస్వస్థతగా ఉండటంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం. అనంతరం విద్యార్థిని పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనలో అసలు ప్రశ్నలు ఇప్పుడు పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారుల వైపు మళ్లుతున్నాయి. కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి అకస్మాత్తుగా ఆరోగ్య సమస్య తలెత్తితే.. ఆమెను వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి లేదా మెరుగైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తరలించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై లేదా సంబంధిత సిబ్బందిపై లేదా? విద్యార్థినిని మొదట ఆర్ఎంపీ వద్దకు ఎందుకు తీసుకెళ్లారు? పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు సరైన వైద్య సదుపాయాలు, సిబ్బంది ఉన్నారా? అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను ఆసుపత్రికి తరలించేందుకు పాఠశాల వద్ద సరైన ప్రోటోకాల్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక విద్యార్థిని మృతి చెందిన అనంతరం ఆర్ఎంపీ వైద్యం, ఇంజెక్షన్ వల్లే మృతి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను అధికారిక వైద్య నివేదిక, పోస్టుమార్టం లేదా సమగ్ర విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంది. వైద్యపరమైన తప్పిదం జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో మొత్తం బాధ్యతను కేవలం ఆర్ఎంపీపై నెట్టివేసి పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారుల బాధ్యతను పక్కన పెట్టడం కూడా సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**- పేద విద్యార్థుల ప్రాణాలకు భద్రత ఎక్కడ..?**

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రధానంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వారి విద్య, వసతి, ఆహారం, ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పాఠశాలల్లో ఆహార నాణ్యత, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య పరీక్షలు, అత్యవసర వైద్య సేవలు, సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారా? విద్యార్థులు అనారోగ్యానికి గురైనప్పుడు వెంటనే వైద్య సహాయం అందించే వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇది ఒక్క విద్యార్థిని మృతి ఘటనగా ముగించకుండా.. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, వసతి, భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందా? అన్న దానిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలి.



## గార్ల సీహెచ్‌సీకి ఐదుగురు వైద్యుల కేటాయింపు

- సీపీఎం పోరాటానికి లభించిన విజయం
- రోగులు, ప్రజల హర్షం.. అధికారులకు, ప్రజాప్రతినిధులకు సీపీఎం ధన్యవాదాలు

గార్ల,ఆగస్టు 11 (ప్రభాత గమనం):

గార్ల మండల కేంద్రంలోని ముప్పె పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో (సీహెచ్‌సీ) ఎదురవుతున్న వైద్యుల కొరత తీరింది. సీపీఎం పార్టీ, దాని అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుదీర్ఘంగా నిర్వహించిన దశలవారీ ఆందోళనలు, పోరాట ఫలితంగా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రికి ఐదుగురు నూతన వైద్యులను కేటాయించింది. ఈ మేరకు మంగళవారం నూతన వైద్యులను కేటాయించడం పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి ఒక ప్రకటనలో తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వైద్య విభాగాధికారి డాక్టర్ చింత రమేష్ మంగళవారం గార్ల సీహెచ్‌సీని సందర్శించి నూతనంగా నియమితులైన వైద్యులను పరిచయం చేసి, విధుల్లోకి ఆహ్వానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులు....డాక్టర్ కె. నాగేశ్వరరావు (ఎం.ఎస్ – జనరల్ సర్జన్) డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి (పిల్లల వైద్య నిపుణులు) డాక్టర్ మౌనిక (గైనకాలజిస్ట్ – స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణురాలు) డాక్టర్ మనీషా (అనస్థీషియా / మత్తు వైద్యురాలు) డాక్టర్ వైశాలి రెడ్డి (జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్) ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం వల్లే ఈ రోజు ఆసుపత్రికి నిపుణులైన వైద్యులు వచ్చారని, దీనివల్ల గార్ల మరియు పరిసర గ్రామాల పేద రోగులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని అన్నారు.



## సంగెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేల్పుల అనిల్ యాదవ్

- జర్నలిస్టుల సంక్షేమమే నా ధ్యేయం
- నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సంగెం మండల కేంద్రంలో సోమవారం రోజున ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. టీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు సధిరం కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చిక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, జిల్లా కోశాధికారి గాయపు రాజిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాయకులు అధికారికంగా ప్రకటించారు. సంగెం మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేల్పుల అనిల్ యాదవ్ (ప్రజా జ్యోతి), ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా వీరస్వామి (సూర్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మచ్చిక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మరియు సామరస్య వాతావరణంలో ఈ ఎన్నికలు జరగడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అధ్యక్షుడిగా నన్ను ఏకగ్రివం చేసిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు మరియు తోటి విలేకరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, పత్రికా విలువలను కాపాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని హామీ ఇచ్చారు. నూతన కమిటీకి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు పాల్గొన్నారు

## 'ఆరుతడి' పంటలే రైతులకు శ్రీరామరక్ష

- ఎంఏవో కావటి రామారావు
- బుదారంలో ఆయిల్ పామ్-పెసర అంతర పంట క్షేత్ర పరిశీలన
- వరికి బదులు పప్పు దినుసులు, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలి
- రైతులకు ప్రత్యామ్నాయ సాగు యాజమాన్య సూచనలు




బుద్దారం,ఆగస్టు 11 (ప్రభాత గమనం):

ఎల్నినో ప్రభావంతో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున, నీటి లభ్యత తక్కువగా ఉన్న తరుణంలో రైతులు వరి పంటకు బదులుగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు.బుద్దారం గ్రామంలో ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా సాగు చేసిన పెసర చేనును ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట దిగుబడి, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పాటించాల్సిన ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై రైతులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ... ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు సకాలంలో పడక, దీర్ఘకాలిక పంటలకు చివర్లో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు.వరికి ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, కూరగాయలు, జొన్నలు, మొక్కజొన్న, వేరుశనగ మరియు చిరుధాన్యాలు (మిల్లెట్స్) సాగు చేయాలని కోరారు.పప్పు దినుసుల సాగు వల్ల నేలలో నత్రజని శాతం పెరిగి భూసారం మెరుగవుతుందని, కూరగాయలు మరియు ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు స్వల్పకాలంలో ఆదాయంతో పాటు ఆహార భద్రత చేకూరుతుందని తెలిపారు.వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి రైతు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పొలాల్లో 'పంట కుంటలు' ఏర్పాటు చేసుకుని, కురిసిన ప్రతి వాన నీటి బొట్టును నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కొద్దిపాటి నీటి నిల్వలు ఉన్నా సరే, ఆరుతడి పంటలను కాపాడుకోవడానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లైబ్రరీకి 30 వేల పుస్తకాలు వితరణ

- భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి



మహబూబాబాద్ ఆగస్టు11(ప్రభాత గమనం):

మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని , కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్, మరియు నరసింగం శ్రీనివాస్, మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

- పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష
- ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిష్పాక్షికంగా సేవలు అందించాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ కి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ , కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయా టలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి వారి సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.




## అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- అవినీతి తిమింగలాల గుండెల్లో నిద్రపోతాం
- దండు వినోద్‌పై కుట్రపూరిత కేసు
- రైస్ మిల్లర్ల కోట్లాది రూపాయల దోపిడీపై రాజీలేని పోరాటం
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మాదం రజినీ కుమార్ యాదవ్

రాజన్న సిరిసిల్ల ఆగస్టు 11(ప్రభాత గమనం):

తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులపై జరుగుతున్న అక్రమ అరెస్టులు, కుట్రలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.రైతుల పక్షాన, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న తమ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ అక్రమంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మండిపడ్డారు.

**- కుట్రలు మరియు అక్రమ కేసులు....**

రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఒక ప్రణాళికాబద్ధమైన కుట్రకు గురయ్యారని, ఆయనపై మోపిన డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని రజినీ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.పోలీసులు సివిల్ డ్రెస్సులో వచ్చి దండు వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారని, ఆయనకు తెలియకుండానే ఇంట్లో డబ్బులు పెట్టి, వాటిని వారే వెతికి తీసి ఎఫ్.ఐ.ఆర్ సృష్టించారని అన్నారు. అయితే, న్యాయస్థానం ఈ కేసులో రిమాండ్ అవసరం లేదని భావించి వెంటనే బెయిల్ మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

**నీలం గురువయ్య అరాచకాలు - బాధితురాలికి అండగా టీఆర్పీ....**

వినోద్‌పై ఫిర్యాదు చేసిన నీలం గురువయ్య అనే వ్యక్తి ఒక మహిళను నమ్మించి, దాదాపు కోటి 50 లక్షల రూపాయలు మోసం చేశాడని,సదరు మహిళ న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే, వేములవాడ పట్టణ ఎస్.ఐ మరియు ఇతరులు కలిసి ఆమెను బెదిరించి, అక్రమ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని రజినీ కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆ మహిళకు న్యాయం చేసే క్రమంలో టీఆర్పీ పార్టీ విచారణ చేపడుతుండటంతో భయపడిన గురువయ్య, పోలీసుల సహకారంతో ఈ తప్పుడు కేసు పెట్టించారని వారు పేర్కొన్నారు.

**రైస్ మిల్లర్ల దోపిడీపై సవాల్:**

సిరిసిల్ల జిల్లాలో రైస్ మిల్లర్లు, ముఖ్యంగా వి.ఆర్.ఆర్ రైస్ మిల్ వంటి వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్లాది రూపాయల సి.ఎం.ఆర్ బియ్యాన్ని ఎగ్గొడుతున్నారని టీఆర్పీ నేతలు కుండబద్దలు కొట్టారు.మీరు నిజంగా నీతిమంతులైతే ప్రభుత్వ ఏజెన్సీలతో విచారణకు సిద్ధమా? అని మిల్లర్లకు సవాల్ విసిరారు. ఒకవేళ మిల్లర్లు తప్పు చేయలేదని తేలితే బహిరంగ క్షమాపణ చెబుతామని, లేదంటే వారి ఆస్తులను జప్తు చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి మరియు అధికారులకు హెచ్చరిక....**

గత ప్రభుత్వ కాలంలో ఉన్న అణిచివేత ధోరణిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అధికారులు కొనసాగిస్తున్నారని, అవినీతిపరులకు కొమ్ముకాస్తున్నారని రజినీ యాదవ్ మండిపడ్డారు.ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, భౌతికంగా దాడులు చేసినా భయపడేది లేదని, ప్రజల సొమ్మును దోచుకునే వారిపై పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల పక్షాన, ముఖ్యంగా రైతాంగం మరియు బాధితుల పక్షాన నిలబడి ఈ అవినీతిపై రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండు వినోద్,చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జీ కొప్పుల వెంకటేష్,జిల్లా నాయకులు,మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి ప్రభుత్వ స్కూళ్లలో తనిఖీలు..

హైదరాబాద్, ఆగస్టు 11(ప్రభాత గమనం):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, వసతులపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ నెల 17వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించేందుకు 307 అకడమిక్ ప్యానెల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు విద్యార్థులకు బోధన, హాజరు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు వంటి అంశాలను పరిశీలించి నివేదిక సమర్పిస్తాయి. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.




## రాజీవ్ యువ వికాస పథకం అమలు ఎప్పుడు..?

మహబూబాబాద్ ఆగస్టు 11(ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పిస్తానని ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం ఎప్పుడు అమలు అవుతుందని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. మహబూబాబాద్ లోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు కురుసం సురేష్ అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రంగయ్య మాట్లాడుతూ. షఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి నేటికీ ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేయటానికి రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తుల సేకరణ జరిగి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఎందుకు ప్రారంభించలేదని ఆయన అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, వర్షాకాలం సీజన్లో గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు పరీక్షలు నిర్వహించడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని రంగయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకపోతే ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగిన జెంజీ తరహా పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా నాయకులు పూణెం రవికుమార్, జోగా సతీష్, మంకిడి సాయి కుమార్, బానోత్ నవీన్ పాల్గొన్నారు.

# ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లుపై వద్దిరాజు స్పందన

- రాజ్యసభలో మాట్లాడిన ఎంపీ రవిచంద్ర

న్యూఢిల్లీ ఆగస్టు 11(ప్రభాత గమనం):



ట్రిబ్యునల్స్ ప్రజలకు త్వరితగతిన, నైపుణ్యంతో కూడిన న్యాయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. సాధారణ న్యాయస్థానాలపై ఉండే భారాన్ని ట్రిబ్యునల్స్ తగ్గిస్తూ, పౌరులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పన్ను చెల్లింపుదారులు, వినియోగదారులు త్వరగా న్యాయం పొందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు.ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ -2026 బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేసి, ట్రిబ్యునల్స్ పరిపాలనను బలోపేతం చేయడం, నియామకాలలో పారదర్శకత తీసుకురావడం, సేవా నిబంధనల్లో ఏకరూపత కల్పించడం వంటి చర్యలు ప్రతిపాదించబడ్డాయని పేర్కొన్నారు.ఇవి స్వాగతించదగిన సంస్కరణలు అని, అయితే, ఈ బిల్లు విజయవంతం కావడం దాని అమలుపైనే ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆలస్యమైన న్యాయం అంటే న్యాయం లభించనట్టేనని, ప్రస్తుతం అనేక ట్రిబ్యునల్స్‌లో అవసరమైన సిబ్బంది లేక ఖాళీలు నెలకొనడంతో ఉండటంతో కేసుల సంఖ్య రోజురోజుకు బాగా పేరుకుపోతున్నాయని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.అందుకుగాను ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా జరపాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ స్వతంత్రంగా, వృత్తిపరంగా పనిచేయాలని, ట్రిబ్యునల్స్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ సామర్థ్యం, జవాబుదారీతనాన్ని పెంచాలని, ప్రతిపాదించిన జాతీయ ట్రిబ్యునల్స్ డేటా గ్రిడ్ ద్వారా కేసుల సమాచారం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా సాంకేతికతను పూర్తిగా వినియోగించాలని ఎంపీ రవిచంద్ర సభ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సేవలను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం జరిగిందన్నారు.దాంతో పాటు న్యాయ, పరిపాలనా మౌలిక వసతుల అభివృద్ధికి కూడా కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.న్యాయ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలంటే చట్ట సంస్కరణలతో పాటుగా పరిపాలనా సంస్కరణలు కూడా అవసరమనే విషయాన్ని ఆయన తెలియపర్చారన్నారు. చివరిగా, దేశంలోని అన్ని ప్రాంతాల్లో ట్రిబ్యునల్ బెంచ్‌లు తగిన సంఖ్యలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని కోరారు.న్యాయం కోసం ప్రజలు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదని, న్యాయ సంస్కరణల ప్రధాన లక్ష్యం త్వరితగతిన, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండే న్యాయ వ్యవస్థ నిర్మాణం జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ సూచనలతో ఈ బిల్లు లక్ష్యాలను తమ పార్టీ బీఆర్ఎస్ సమర్థిస్తున్నదని, ప్రభుత్వం ఈ సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేస్తుందని ఆశిస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు చెప్పారు.





# పెద్దలను కలుస్తూ.. ముందుకు సాగుతూ..



- అడుగులు వేస్తున్న సమ్మి గౌడ్
- నాయకుల సమన్వయంతో కాంగ్రెస్ బలోపేతానికి సమ్మిగౌడ్ కృషి
- పలువురి నేతలను కలిసిన కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్

కేసముద్రం ఆగస్టు 11 (ప్రభాత గమనం):

కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన చిలువేరు సమ్మయ్య గౌడ్ బాధ్యతల స్వీకారం అనంతరం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా మండలంలోని సీనియర్ నాయకులు, ముఖ్య నేతలను మర్యాదపూర్వకంగా కలుస్తూ వారి ఆశీస్సులు, సూచనలు తీసుకుంటున్నారు.తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నేతలను సమ్మయ్య గౌడ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర రావు, కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్మన్ రామా నాగేశ్వర రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్నలను ఆయన పరామర్శించి పార్టీ వ్యవహారాలపై చర్చించారు. అలాగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు గూగులోతు దస్రు నాయక్, జిల్లా స్పోక్స్ పర్సన్ అంబటి మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండారు పద్మ, మాజీ ప్యాక్స్ చైర్మన్ బండారు వెంకన్న, ఎంపీటీసీ,సర్పంచ్ బండారు గోపమ్మ దయాకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీలం సుహాసిని-దుర్గేష్ తదితర ముఖ్య నేతలను కలిసి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో కేసముద్రం మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."సీనియర్ నాయకుల సుదీర్ఘ అనుభవం,సలహాలు-సూచనలు మాకు మార్గదర్శకమని తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, సమిష్టిగా పనిచేస్తూ కేసముద్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలాన్ని చేకూర్చడమే నా ప్రాధాన్యత అన్నారు.కేసముద్రం మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని సమ్మయ్య గౌడ్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని, రాబోయే రోజుల్లో చేపట్టే ప్రతి నిరసన, అభివృద్ధి కార్యక్రమాల్లో కార్యకర్తల నుంచి నాయకుల వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండేలా చూస్తామన్నారు.మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే కాకుండా, జిల్లా స్థాయిలో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, నూతన అధ్యక్షుడికి సీనియర్ నాయకులు అభినందనలు తెలుపుతూ... పార్టీ బలోపేతానికి, రాబోయే సమరానికి తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

- పశుపోషకులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :




పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి, పశుపోషకులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ డాక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో పశుసంవర్ధక, పశువైద్య శాఖ కార్యకలాపాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని శాఖల వారీగా కార్యక్రమాల అమలు, పురోగతిని సమీక్షించారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, పశుగణన, పశుపోషకులకు అవగాహన కార్యక్రమాలు, పశుసంపద అభివృద్ధి, పాడి పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువులకు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, టీకా కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పశుపోషకులకు అందుబాటులో ఉండేలా పశువైద్య సేవలను మరింత విస్తరించాలని, అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చూడాలని తెలిపారు. పశుసంపదను పెంపొందించడం ద్వారా రైతులు, పశుపోషకులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించడంతో పాటు పాడి పరిశ్రమ, అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, పశువైద్య సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ పశుపోషకుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని, పశుసంపద సంరక్షణతో పాటు పశుపోషకుల ఆదాయం పెరిగేలా శాఖా కార్యక్రమాలు ఫలితాలను ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకృష్ణ, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి



- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా తమ బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహిస్తున్న రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ఐసీఓపీ), ఫొటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రారంభించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం సీబీసీ వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా జాతీయ పతాకం ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అంశాలను ఫొటో ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, బాధ్యతలు, పౌరులుగా తమ కర్తవ్యాలు ఏమిటో ఇలాంటి కార్యక్రమాలు గుర్తు చేస్తాయని అన్నారు. ఎప్పుడూ హక్కుల కోసం పోరాడటం ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు మన బాధ్యత ఏమిటో కూడా తప్పనిసరిగా తెలుసుకోవాలి అని పేర్కొన్నారు. మనకు లభించిన స్వాతంత్ర్యానికి గౌరవం, విలువ ఇస్తూ భవిష్యత్ తరాలకు ఎలాంటి సమాజాన్ని అందించాలనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని తెలిపారు. యువత తమ జీవితాలను ఎలా మలుచుకోవాలనేది వారి చేతుల్లోనే ఉందని, కష్టపడి పనిచేసి జీవితాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు.

## స్వేచ్ఛను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టమని, ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని అన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అనంతరం క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీ లత, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యంగా..

- రోడ్డు గుంతలు పూడ్చిన పోలీసులు!
- గార్ల-డోర్నకల్ ప్రధాన రహదారిపై చొరవ చూపిన సీఐ రవీందర్, ఎస్ఐ సాయికుమార్
- రహదారి భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి..
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులకు విజ్ఞప్తి

గార్ల,ఆగస్టు 11 (ప్రభాత గమనం ):

గార్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రమాదకర గుంతను స్థానిక పోలీసులు పూడ్చివేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గత కొంతకాలంగా గార్ల నుండి డోర్నకల్ వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ గుంతలు కనిపించక పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడి తీవ్రంగా గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి.వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం గార్ల-బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్, గార్ల సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ లు పోలీస్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అనంతరం ప్రమాదాలకు కారణమవుతున్న గుంతను శ్రమదానంతో పూడ్చివేశారు. రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే స్పందించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు, స్థానికులకు పెద్ద ఎత్తున ఊరట లభించింది."రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ఎంతోమంది కిందపడి గాయపడ్డారు. అధికారుల కంటే ముందే పోలీసులు స్పందించి గుంతను పూడ్చడం అభినందనీయం.పోలీసులు చూపిన చొరవపై స్థానికులు, వాహనదారులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో గార్ల మండలంలోని ఇతర ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను కూడా సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే గుర్తించి, శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గార్ల పోలీస్ సిబ్బంది శ్యామ్, హనుమంతులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# గూడూరులో వాహనాలకు బహిరంగ వేలం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 17 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 13న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నల్లబెల్లం, నాటుసారా రవాణా తదితర కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి పి. కరంచంద్ సమక్షంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ఎక్సైజ్ స్టేషన్‌లో ఉంచిన వాహనాలను స్వయంగా పరిశీలించుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రతి వాహనానికి విడిగా వాహనం ధరలో 50 శాతం మొత్తాన్ని ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ గురువారం ఉదయం 10 గంటలలోపు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు నిర్ణీత సమయంలోపు అవసరమైన మొత్తాన్ని చెల్లించి వేలంలో పాల్గొనాలని గూడూరు ఎక్సైజ్ సీఐ బిక్షపతి కోరారు.

P-04_Layout 2 12-Aug-26 09:24 AM Page 1








# కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటన

- కర్రెగుటలో అభివృద్ధికి సువర్ణ అధ్యాయానికి డిజిపి అడుగులు
- హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలని డిజిపి సివి ఆనంద్ సందేశం
- లొంగిపోవాలని గణపతి దంపతులకు పోలీసుల పిలుపు
- కాకరాల సమతకు రూ. 20 లక్షల చెక్ అందజేత
- పునరావాస విధానంతో ఇప్పటివరకు లొంగిపోయిన 23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం

భాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఆపరేషన్ కగార్ తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఏప్రిల్ 7న కర్రెగుటలలోని సిఆర్పిఎఫ్ 39 పామూనురు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పామూనురు బెటాలియన్ ను దాటి చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. డీజీపి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కర్రేగుట్టల్లో ఆయన పర్యటించారు. ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న డిజిపి జిల్లాలోనే బస చేసి సోమవారం ఉదయం పామునూరు 39 సిఆర్పిఎఫ్ బేస్ క్యాంపునకు చేరుకున్న ఆయన పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి కర్రేగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. పామునూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడ పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పామునూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పునరావాస విధానాలతోనే మావోయిస్టుల లొంగుబాటు.

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మావోయిస్టుల అణచివేతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేశామని తెలిపారు. మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయించామని, కొందరు ఎన్కౌంటర్లలో మృతి చెందగా.. ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీ శాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.

## 40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి..

దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్గ్రౌండ్లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపి సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు.

## 1985లో అండర్ గ్రౌండ్ లోకి..

1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు ప్రభావితమైన సమత అండర్గ్రౌండ్లోకి వెళ్లినట్లు డీపిజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారన్నారు. హైదరాబాద్ కమిటీలో సుమారు పదేళ్లు, నల్లమలలో నాలుగేళ్లు, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీలో రెండేళ్లు, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ' లో రెండేళ్లు, మహారాష్ట్ర ఏరియా కమిటీలో ఐదేళ్లు, కర్ణాటక–మహారాష్ట్ర ఉమ్మడి కమిటీలో పదేళ్లు పనిచేసినట్లు వివరించారు.

## పార్టీ డాక్యుమెంటేషన్ లో కీలక పాత్ర

సమత సాయుధ కార్యకలాపాలతో పాటు పార్టీ సిద్ధాంతపరమైన, డాక్యుమెంటేషన్ బాధ్యతలు నిర్వహించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ తీర్మానాలు, పార్టీ పత్రాల రూపకల్పన, సిద్ధాంతపరమైన అంశాల రచన, అనువాదాలు, మహిళా సమస్యలపై వ్యాసాల రచన, క్యాడర్కు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు చేపట్టారన్నారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్గా కూడా పనిచేసినట్లు సమత వెల్లడించిందన్నారు.

## కుటుంబంలోనూ మావోయిస్టు నేపథ్యం

సమత సోదరి కాకర్ల సునీత అలియాస్ బద్రి కూడా సీనియర్ మావోయిస్టు నాయకురాలిగా పనిచేసి గత ఏడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు డీజీపి తెలిపారు. మరో కజిన్ సోదరి కాకర్ల పద్మ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాల్లో పనిచేసిందన్నారు. 2018లో అరెస్టయిన ఆమె ప్రస్తుతం బెయిల్పై చెన్నైలో ఉంటున్నట్లు వెల్లడించారు.సమత భర్త పటేల్ సుధాకర్రెడ్డి మావోయిస్టు పార్టీలో సీనియర్ క్యాడర్గా, మిలిటరీ కమిషన్, పార్టీ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలకంగా పనిచేసినట్లు డీజీపి తెలిపారు. 2010లో జరిగిన ఎదురుకాల్పుల్లో సుధాకర్రెడ్డి మృతి చెందినట్లు చెప్పారు.

## సరెండర్ క్యాడర్ కు ప్రభుత్వం అండ

మావోయిస్టుల పునరావాసంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని డిజిపి సీవీ ఆనంద్ తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సామాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

## ఉపాధి.. శిక్షణ.. రుణాలు

సరెండర్ అయిన వారు గౌరవప్రదంగా జీవించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డిజిపి తెలిపారు. వృత్తి లేదా వ్యాపారం చేయాలనుకునే వారికి శిక్షణతో పాటు రుణాలు అందించి స్వయం ఉపాధికి సహకరిస్తామన్నారు. ఆరోగ్య, కేసులు లేదా ఇతర సమస్యలు ఉంటే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. సరెండర్ అయిన వారిని పూర్తిగా జనజీవన స్రవంతిలో కలపడం పునరావాస విధానం లక్ష్యమన్నారు.

## 23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం

పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ, పార్టీ మెంబర్ లేదా ఇతర క్యాడర్ అనే తేడా లేకుండా సరెండర్ తర్వాత సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.

## గణపతి దంపతులకు పోలీసుల పిలుపు

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్గ్రౌండ్లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.

## ములుగులోనే సమావేశం ఎందుకంటే..

మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతో హైదరాబాద్కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ–ఛత్తీస్గఢ్ మధ్య దట్టమైన అటవీ ప్రాంతం గతంలో మావోయిస్టు కార్యకలాపాలకు కారిడార్గా ఉండేదని, ఈ ప్రాంతంలో పర్యటించి సరెండర్ క్యాడర్తో నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. వారి సమస్యలు, పునరావాస విధానంలోని లోపాలు, కేసుల సమస్యలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్ర, ఛత్తీస్గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

## హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలి

మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచి సమాజంలో కలిసిపోవాలని డిజిపి సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. సరెండర్ అయిన వారు తిరిగి అండర్గ్రౌండ్ బాట పట్టకుండా కుటుంబాలతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయడమే ప్రభుత్వ పునరావాస విధానం లక్ష్యమన్నారు. “సరెండర్ అయిన వారికి ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉపాధి, శిక్షణ, రుణాలు, ఆరోగ్య సమస్యలకు వైద్య సాయం అందిస్తాం. వారు సాధారణ పౌరులుగా జీవించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం” అని తెలిపారు. కర్రెగుట్టలో పర్యటనలో డిజిపి సివి ఆనంద్ తో పాటు మల్టీజెన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, సిఆర్పిఎఫ్ ఎడిజి విక్రమ్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పి సింధు శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, ఏ ఎస్ పి మనన్ భట్ ఐపిఎస్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

నెలవారీ తనిఖీల్లో భాగంగా హనుమకొండలోని రెడ్క్రాస్ భవనం వెనుక ఉన్న ఈవీఎం గోడౌన్ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం పరిశీలించారు. గోడౌన్లోని స్ట్రాంగ్రూమ్ సీళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్కు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్యాక్స్ ఎన్నికలు జరపరా?

- రైతు తీర్పుకు ప్రభుత్వ భయమా?
- ఓటమి భయంతోనే నామినేటెడ్ దొడ్డిదారికా?
- రైతుల ఓటు హక్కును కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కార్
- సహకార వ్యవస్థను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చొద్దు: బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి రమేష్

గార్ల,ఆగస్టు 11 (ప్రభాత గమనం):



గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి అండగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన నామినేషన్ల ద్వారా పదవులు పంచుకుంటోందని బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎం పి టి సి శీలంశెట్టి రమేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల భాగస్వామ్యం, వాటా హక్కులు, ఓటు హక్కుల ఆధారంగా నడిచే పి ఎస్ సి ఎస్ లలో ఎన్నికలు నిర్వహించకుండా, ప్రభుత్వ అధికారంతో పదవులను భర్తీ చేయడం ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వేలాది మంది రైతులకు తమ ఓటు ద్వారా పాలకవర్గాన్ని, చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకునే హక్కు ఉంది. ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలిచ్చి అధికారాంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. రైతుల ఆగ్రహాన్ని, వారి తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేకే ఎన్నికలకు వెళ్లకుండా ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది" అని రమేష్ దుయ్యబట్టారు. ప్రభుత్వానికి నిజంగా రైతులపై నమ్మకం ఉంటే తక్షణమే పి ఎ సి ఎస్ ఎన్నికలు నిర్వహించి తమ ప్రజాదరణను నిరూపించుకోవాలని, అంతేకానీ అధికార బలంతో పదవులను భర్తీ చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. పి ఎ సి ఎస్ లు ఏ ఒక్క రాజకీయ పార్టీ సొత్తు కాదని, అవి రైతుల సభ్యత్వం, కష్టం మరియు భాగస్వామ్యంతో ఏర్పడిన వ్యవస్థలని ఆయన గుర్తుచేశారు. రైతులకు సంబంధించిన ఈ సహకార సంఘాలను కాంగ్రెస్ పార్టీ తన నాయకులకు 'రాజకీయ పునరావాస కేంద్రాలు'గా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతుల ఓటు హక్కును కాలరాస్తే రాబోయే రోజుల్లో రైతులే ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- నాలుగో బెటాలియన్, వాగేవి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ అవేర్నెస్ కార్యక్రమాలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సైబర్ నేరాల నివారణతో పాటు వాటిపై దర్యాప్తు, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (CCPS) ఆధ్వర్యంలో మంగళవారం రెండు సైబర్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. మామునూరులోని నాలుగో బెటాలియన్లో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ ఎ. వెంకటరమణ, ఎస్ఐ చరణ్ కుమార్, హెచ్సీ శ్రీనివాస్, పీసీలు ధనేష్, రాజు పాల్గొని సుమారు 200 మంది కానిస్టేబుళ్లకు సైబర్ నేరాల దర్యాప్తు, ఆర్థిక సైబర్ నేరాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నమోదు, సైబర్ పోర్టల్ వినియోగం, సైబర్ మోసాల విషయంలో 'గోల్డెన్ అవర్'లో తక్షణ స్పందన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనధికారిక ఆన్లైన్ బెట్టింగ్ యాప్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటికి దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, కమాండెంట్ డి. శివప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. బిజినెస్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, మ్యూల్ అకౌంట్లు, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు ఇవ్వడం వల్ల ఎదురయ్యే ఆర్థిక, చట్టపరమైన ప్రమాదాలను విద్యార్థులకు వివరించారు. కమీషన్ కోసం తమ బ్యాంకు ఖాతాలను ఇతరులు ఉపయోగించుకునేందుకు అనుమతించడం కూడా తీవ్రమైన చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, యాప్లు, పెట్టుబడి ఆఫర్లు, ఆన్లైన్ ఉద్యోగ ప్రకటనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని, అనుమానాస్పద కాల్స్, సందేశాలకు స్పందించే ముందు వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయకూడదని, అనధికారిక యాప్లను డౌన్లోడ్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్కు కాల్ చేయడంతో పాటు, www.cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు సూచించారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్పాయి
- సీపీ శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం పరకాలలోని ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదికతో పాటు వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాహత్ బాజ్పాయి మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు, అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా వేదిక, పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హెలిప్యాడ్, రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374